సాక్షి
మంచిర్యాల
మంగళవారం • 5 • ఆగస్టు • 2025



తల్లిపాల వారోత్సవాలు 9లో▸

తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది గర్భిణులు, బాలింతలకు పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.



నార్కోటిక్ డాగ్‌కు బంగారు పతకం

మంచిర్యాలక్రైం: నార్కోటిక్ డాగ్(సింబా) బంగారు పతకం సాధించడం అభినందనీయమని సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం డాగ్, కానిస్టేబుల్ గోపాలకృష్ణను అభినందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /27.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

టీచర్ల సర్వీసు రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా సర్వీసు రికార్డులు, ధ్రువపత్రాల పరిశీలన సోమవారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించారు. స్కూల్‌అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతి జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు తరలివచ్చారు. పదోన్నతుల కమిటీ సభ్యులు ఉపాధ్యాయుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హత సర్టిఫికెట్లతోపాటు డీఎస్సీలో వచ్చిన మార్కులు, ర్యాంకు, ఉద్యోగంలో చేరిన తేదీ, రూల్ రిజర్వేషన్ ప్రకారం సాధించిన రోస్టర్ పాయింట్లు తదితర వివరాలపై ఆరా తీశారు. స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎన్, పీడీ పోస్టుల కోసం పదోన్నతుల కమిటీ పరిశీలించింది. పదోన్నతులకు 1:3 నిష్పత్తిలో సీనియార్టీ జాబితా ప్రకటించారు. సబ్జెక్టుల వారీగా 90ఖాళీలు చూపించారు. జనరల్, వర్గీకరణ మేరకు ఎస్సీలకు గ్రూపులు, దివ్యాంగులకు కేటగిరీ వారీగా పదోన్నతులకు రోస్టర్ విధానంలో కేటాయించారు. ప్రతీ సబ్జెక్టు ఎంఈవో, జీహెచ్‌ఎంతోపాటు కంప్యూటర్ సహాయకులు పరిశీలన చేస్తున్నారు. రెండ్రోజులపాటు దస్త్రాల పరిశీలన కొనసాగనుంది.

టీఎంసీ వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సభ్యురాళ్లు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీ టౌన్ మిషన్ కోఆర్డినేటర్(టీఎంసీ) రామకృష్ణ వేధింపులకు గురి చేస్తున్నారని చెన్నూర్ మెప్మా సభ్యురాళ్లు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా మార్పు రాలేదని పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిని మరింత వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా రుణగ్రహీతల నుంచి డబ్బులు ఇప్పించాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. రుణాలు పొందిన వారి నుంచి డబ్బు ఇప్పించని సభ్యురాళ్లను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని సమాచారం. గతంలో ఇక్కడ పని చేసిన మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా.. మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూస్తానని టీఎంసీ హామీపత్రం రాసిచ్చినట్లు తెలిసింది. ఆ కమిషనర్ బదిలీ కావడంతో మళ్లీ వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురి చేస్తున్న టీఎంసీపై చర్యలు తీసుకోవాలని, ఇక్కడి నుంచి బదిలీ చేయాలని కోరినట్లు తెలిసింది. ఇటీవల చెన్నూర్‌లో పర్యటించిన మంత్రి వివేక్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

లాభాల బోనస్ ప్రకటించాలి



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

నస్పూర్: సింగరేణి యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరం ఆర్జించిన లాభాల్లో నుంచి కార్మికులకు బోనస్ వెంటనే ప్రకటించాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. లాభాల్లో 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం 7న అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన, 14న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, 21న కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలో 11 ఏరియాల్లో రణభేరి యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, నాయకులు రాంశెట్టి నరేందర్, స్వామి, తిరుపతి రాజు, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, జీవన్, ప్రకాశ్‌రావు, రౌతు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

‘విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం’

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉత్తమ్ జాడే అన్నారు. సోమవారం జిల్లా ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్ఈ మాట్లాడుతూ బిల్లుల హెచ్చుతగ్గులు, వినియోగంలో ఇబ్బందులు, తదితర ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఖైజర్, ఏడీఈలు పాల్గొన్నారు.

చెర వీడిన బాల్యం



పిల్లలను పాఠశాలలో చేర్పించిన ముస్కాన్ బృందం సభ్యులు

- ‘ముస్కాన్’లో 193మంది బాలకార్మికులకు విముక్తి
- 18 కేసులు నమోదు

మంచిర్యాలక్రైం: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తోంది. కార్మిక, పోలీసు, రెవెన్యూ శాఖలు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో బాలకార్మికులకు విముక్తి కల్పిస్తోంది. ఈ ఏడాది జూలై ఒకటిన ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం 31రోజులపాటు నిర్వహించారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 193మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. బడి బయట ఉన్న, తప్పిపోయిన, అనాథలు, భిక్షాటనకు పరిమితం అవుతున్న వారిని గుర్తించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. బాలలను పనిలో పెట్టుకున్న 18మందిపై కేసులు నమోదు చేశారు. మంచిర్యాల జిల్లాలో బాలురు 84, బాలికలు 38మందికి విముక్తి కల్పించి 12 కేసులు నమోదు చేశారు. కొందరిని తల్లిదండ్రుల వద్దకు పంపించగా.. 13మంది బాల కార్మికులను బడిలో చేర్పించారు.

2,327మందికి విముక్తి..

ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 2017నుంచి ఇప్పటివరకు 2,327 మంది బాల కార్మికులను గుర్తించారు. వీరిని బాలల సంరక్షణ కమిటీ ఎదుట హాజరుపర్చిన తర్వాత తల్లిదండ్రులకు అప్పగించడం, ఇతర రాష్ట్రాల వారైతే పంపించడం వంటి చర్యలు చేపట్టారు. మరికొందరిని స్థానికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. కొన్ని చోట్ల వసతి కల్పించారు.

తీరు మారాలి

ఆయా కార్యక్రమాల ద్వారా మార్పులు కనిపిస్తున్నాయి. మొదట్లో పట్టుబడిన బాలకార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండగా క్రమంగా ఆ సంఖ్య తగ్గుతూ వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పని చేస్తే ప్రజలు చైతన్యవంతులై తమ పని తీరు మారుతుందని సూచిస్తున్నారు. పోలీసులు, ఉమెన్ చైల్డ్ హెల్ప్‌లైన్ వెల్ఫేర్ అధికారులు మాత్రమే కీలకంగా వ్యవహరిస్తున్నారు. మిగతా శాఖలు కూడా సహకారాన్ని అందించే విషయంలో నామమాత్రంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిసినా, ఎవరైన తప్పిపోయినా, వదిలేసిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్‌హెల్ప్ లైన్ 1098, డయల్ 100కు సమాచారం అందించాలి. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకారం అందించాలి.

– అంబర్ కిషోర్ ఝా, రామగుండం పోలీస్ కమిషనర్

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



ఎన్.రాంచందర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలో బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు తోపాటు సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పర్యటన విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర కమల దళపతి హోదాలో తొలిసారి ఆయన జిల్లాకు వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దండేపల్లి మండలం గూడెం బ్రిడ్జి మీదుగా లక్సెట్టిపేటకు చేరుకుంటారు. అక్కడి నుంచి పట్టణానికి బైక్‌ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడ ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో రైతు సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులను కలుస్తారు. తర్వాత ఆసిఫాబాద్ జిల్లా వెళ్లే క్రమంలో మార్గమధ్యలో మందమర్రిలో స్థానిక నాయకులతో భేటీ అవుతారు. చెన్నూరు నియోజకవర్గ ఇన్చార్జి, దుర్గం అశోక్ నేతృత్వంలో ఇక్కడ ఏర్పాట్లు చేశారు. తిరిగి ఆసిఫాబాద్ జిల్లా పర్యటన ముగించుకుని జిల్లా గుండా వెళ్లే సమయంలో బెల్లంపల్లిలో నాయకులను కలిసే అవకాశముందని జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.

సమావేశం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

లక్సెట్టిపేట/మందమర్రిరూరల్: ఈ నెల 5న లక్సెట్టిపేటలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్‌హాల్‌లో, మందమర్రిలో నిర్వహించే సమావేశాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన లక్సెట్టిపేట ఐబీ ఆవరణలో, మందమర్రిలోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. రైతు సమ్మేళన సమావేశాలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో నాయకులు దుర్గం అశోక్, నరేష్, హరిగోపాల్, నరేష్‌చంద్, ముత్తె సత్తయ్య, స్వామిరెడ్డి, దీక్షితులు, సంజీవరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసులు సస్పెండ్

- మహిళకు సంబంధించిన ఘటనలో ఓ హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు
- మహిళా పోలీసుపై వేధింపుల వ్యవహారంలో కానిస్టేబుల్

జైపూర్: జైపూర్ సబ్ డివిజన్(అసిస్టెంట్ కమిషనరేట్) పరిధిలోని శ్రీరాంపూర్ సర్కిల్ పరిధిలో ఉన్న ఓ పోలీసుస్టేషన్‌కు చెందిన ముగ్గురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు.. మహిళలకు సంబంధించిన వ్యవహారాల్లో గత నెలలో సస్పెన్షన్‌కు గురైనట్లు చర్చ జరుగుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో కమిషనరేట్లు ఏర్పడగా జైపూర్ సబ్ డివిజన్‌గా ఏర్పడింది. జైపూర్ పోలీసుస్టేషన్ పై భాగంలో అసిస్టెంట్ కమిషనరేట్ హోదాలో ఏసీపీ విధులు నిర్వర్తిస్తున్నారు. శ్రీరాంపూర్ సర్కిల్‌లో సీఐ నేతృత్వంలో మండలాల్లోని పోలీసుస్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓలుగా ఎస్సైలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఓ పోలీసు స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్ ఊరుశ్రీరాంపూర్‌కు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా.. అంతకుముందు ఆ మహిళతో పరిచయం ఉన్న హోంగార్డుపై కక్ష పెంచుకుని ఫిర్యాదు చేయించారు. ఈ కేసులో హెంగార్డును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో హోంగార్డు కుటుంబ సభ్యులు జరిగిన విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. విచారణ జరిపిన అధికారులు హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా.. ఇదే పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను కానిస్టేబుల్ వేధిస్తూ తరచూ ఫోన్‌కు మెసేజ్‌లు పంపించగా.. ఈ ఘటనలో ఆ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, వారి ప్రవర్తన ఆ శాఖకు చెడ్డపేరు తీసుకొస్తోంది.

ప్రవర్తన సరిగ్గా లేక..

ఓ హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసిన విషయం వాస్తవమే. వీరిద్దరు గత నెలలో సస్పెండ్ కాగా అంతకుముందు హోంగార్డు కూడా సస్పెండ్ అయ్యాడు.

– ఆరే వెంకటేశ్వర్, ఏసీపీ జైపూర్

ఫిర్యాదులు రానివ్వొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆయా సమస్యలపై పదేపదే ఫిర్యాదులు రానివ్వొద్దని, సత్వరమే పరిష్కరించే విధంగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.చంద్రయ్య, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, మంచిర్యాల డివిజన్ అటవీ అధికారి సర్వేశ్వర్‌లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జా, పింఛన్, భూ సమస్యలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు. తన తల్లి అలీమబేగం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చనిపోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని షేక్‌ముక్త్యార్ కోరారు. జీరో బిల్లు రావడం లేదని నస్పూర్‌కు చెందిన గుంపుల రాజు, రైతుభరోసా నగదు అందలేదని మందమర్రికి చెందిన దుర్గం తిరుపతి, అక్రమ పట్టా రద్దు చేయాలని మంచిర్యాలలోని జాఫర్‌నగర్‌కు చెందిన కుర్మ రామక్క దరఖాస్తు అందజేశారు.

కొడుకు పట్టించుకోవడం లేదు



నాకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. నా భర్త చనిపోయి 15ఏళ్లు అవుతుంది. ఒంటరిగా బతుకుతున్న. నా చిన్న కుమారుడు సమ్మయ్య కరోనాతో మరణించాడు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ భూమి మొత్తం పట్టా చేసుకుని అనుభవిస్తూ పట్టించుకోవడం లేదు. ఆ పట్టా రద్దు చేసి నా పేరిట చేయాలి. నేను మరణించే వరకు ఆలనాపాలన చూసుకునే వారికి చెందేలా చర్యలు తీసుకోవాలి.

– మేద ఆంకు, శంకరపూర్, కోటపల్లి

అక్రమాలపై విచారణ జరపాలి



ప్రాథమిక కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం జిల్లా కన్వీనర్‌గా గాజుల ముకేష్‌గౌడ్ ప్రకటించుకుని అనేక అవకతవకలకు పాల్పడుతున్నాడు. నెలకు రూ.2.80లక్షల వరకు తీసుకుంటున్నాడు. ప్రశ్నిస్తే సభ్యత్వం తొలగిస్తామని బెదిస్తున్నారు. అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి న్యాయం చేయాలి.

– కోల రాజగౌడ్, మంచిర్యాల

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ఆసుపత్రిలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామ స్థాయి నుంచి ప్రజా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి ఎంపీడీవోలు, ఏపీవోలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పత్తి పంట సాగులో అంతరపంటగా మునగ సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతీ మండలానికి ముగ్గురు నలుగురు రైతులను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని తెలిపారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. సోమవారం ఆయన నస్పూర్ పీహెచ్‌సీ, కేజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో పరిసరాలు, వంటగది పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

కళాశాలలో మెనూ అమలు చేస్తున్నారా..

మంచిర్యాలఅర్బన్: కళాశాలలో ఏమైనా ఇబ్బందులున్నాయా..? మెనూ ప్రకారం భోజనం అమలు చేస్తున్నారా..? అంటూ కలెక్టర్ కుమార్‌దీపక్ విద్యార్థినులను ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదికి వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. భవనాల చుట్టూ బాయ్స్ హాస్టల్ ఉండడంతో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల భవనం మార్పు విషయం ప్రస్తావనకు వచ్చింది.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

మంచిర్యాలటౌన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తలపెట్టిన బీసీ రిజర్వేషన్ ధర్నాకు టీఎన్జీవోస్ మద్దతునిస్తుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి అనుముల సతీశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఉపాధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. డ్రెయినేజీ.. పిచ్చిమొక్కలు

- పట్టణంలోని సమస్యలు పరిష్కరించండి
- ‘సాక్షి’ ఫోన్ ఇన్‌లో ప్రజల వినతులు
- సమస్యల పరిష్కారానికి కృషి
- మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ సంపత్‌కుమార్

లక్సెట్టిపేట: డ్రెయినేజీలు లేవు.. పిచ్చిమొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి అంటూ లక్సెట్టిపేట పట్టణంలోని ప్రజలు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌ను కోరారు. మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పలువురు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మురుగునీరు రోడ్లపై పారుతోందని తెలిపారు. సమస్యలను విన్న కమిషనర్ సంపత్‌కుమార్, మేనేజర్ రాజశేఖర్ పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ప్రజలు విన్నవించిన వెంటనే కొన్నింటి పరిష్కారానికి సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించారు.

ప్రశ్న: మూడో వార్డులో సీసీ రోడ్డు పూర్తిగా లేదు. డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు విపరీతంగా నిలుస్తోంది. నిత్యం ఇబ్బందిగా ఉంటుంది.

– సప్పు రవి, ఇటిక్యాల, మూడోవార్డు

కమిషనర్: సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాను. వర్షపు నీరు నిలువకుండా ముందస్తు చర్యలు చేపడుతాం. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్‌పౌడర్ వేయిస్తాను.

ప్రశ్న: వీధి దీపాలు వెలుగడం లేదు. 13వ వార్డులోని వీధిలో భారీ వృక్షం పెరిగింది. ఎప్పుడు పడిపోతుందోననే భయం ఉంది. ఇళ్లపై పడితే ప్రమాదం జరుగుతుంది. చెట్టును తొలగించాలి.

– విజయేందర్, షెలెహా భాను, 13వ వార్డు

కమిషనర్: వీధి దీపాలు త్వరలోనే వేయిస్తాను. విద్యుత్ అధికారులతో మాట్లాడి దీపాలు వెలగించేందుకు చర్యలు తీసుకుంటాను. వృక్షాన్ని పరిశీలించి ప్రమాదం ఉన్నట్లయితే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాను.

ప్రశ్న: చెత్తబండ్లు రావడం లేదు. చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయి. చెప్పినా పట్టించుకోవడం లేదు. దుర్వాసన వస్తుంది. ఫంక్షన్ హాల్‌లోకి వర్షపు నీరు వచ్చి ఇబ్బంది అవుతుంది. రాకుండా చూడాలి.

– లాశెట్టి సతీష్, రాగుల పెద్దన్న, 8వ వార్డు

కమిషనర్: చెత్తబండ్లను అన్ని వీధుల్లోకి పంపుతున్నాం. త్వరలో చెత్తబండ్లను పంపించి చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకంటాను. వర్షపు నీరు ఫంక్షన్ హాల్‌లోకి రాకుండా డ్రెయినేజీ నిర్మాణం చేపడుతాం.

ప్రశ్న: పంట కాలవలోకి కొందరు డ్రెయినేజీ నీరు వదులుతున్నారు. దీంతో దుర్గంధం వస్తుంది. డ్రెయినేజీ నీరు కాలువలోకి రాకుండా చూడాలి.

– శివనాగకుమార్, 7వ వార్డు

ప్రశ్న: వీధి కుక్కల బెడద విపరీతంగా ఉంది. ప్రజలను కరుస్తున్నాయి. మిషన్ భగీరథ పైపులైను పగిలిపోయింది. నీరంతా వృథా పోతోంది. నీరు రావడం లేదు.

– ఎంబడి అశోక్, 11వ వార్డు, మెట్టు వేణు గోపాల్, 12వ వార్డు

కమిషనర్: కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించేలా డాగ్ క్యాచర్‌ను పిలిపిస్తున్నాం. కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాను. మిషన్ భగీరథ అధికారులకు తెలియజేసి పైపులైన్ మరమ్మతు జరిపించి నీరందేలా చూస్తాను.

కమిషనర్: డ్రెయినేజీ నీరు కాలువలోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. నీటిని నాళాలోకి మళ్లించేలా నిర్మాణాలు చేపడుతాం.

ప్రశ్న: నాలాపై చికెన్‌సెంటర్ తొలగించాలి. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయడం లేదు. ఓపెన్‌ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. కుళ్లిన వ్యర్థాలను వాటిలో పడేస్తున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇబ్బందులకు గురవుతున్నాం.

– దర్శనాల నవీన్, 9వ వార్డు, మల్లారెడ్డి, 13వ వార్డు, తిప్పని మల్లేష్, 2వ వార్డు

కమిషనర్: నాలాపై నిర్మించిన చికెన్‌సెంటర్‌ను పరిశీలించి తొలగిస్తాను. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయిస్తాను. కొందరు ప్లాట్లు కొనుగోలు చేసి ఖాళీగా ఉంచడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. వాటిని శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాను.

అత్యవసర పరిస్థితుల్లోనే సెలవులు తీసుకోవాలి



దండేపల్లిలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

జన్నారం/దండేపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యసిబ్బంది అత్యవసర పరిస్థితుల్లోనే సెలవులు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. సోమవారం ఆయన జన్నారం, దండేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జన్నారంలో సెలవులో ఉన్న వైద్యురాలు లక్ష్మికి మెమో జారీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పరిశుభ్రత, దోమలు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అసంక్రమణ వ్యాధుల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, వైద్యాధికారి ఉమాశ్రీ, జిల్లా మాస్‌మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.11వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. 2021లో బాధితుడు నవీద్ అహ్మద్ రైతుబజార్ నుంచి కూరగాయలు తీసుకొని రాంనగర్‌లో గల తన ఇంటివైపు వెళ్తుండగా రణదీవెనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సురేతార్ సంతోష్ కలెక్టరేట్ చౌరస్తా వద్ద వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో నవీద్ అహ్మద్ మృతి చెందాడు. బాధితుడి తండ్రి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహిన్ సుల్తాన నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పు వెలువరించారు. వాహన యజమాని బమ్మకంటి శివమణికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు వివరించారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

ఒకరికి ఏడాది..

భీమిని: మహిళను వివస్త్రను చేయడమే కాకుండా దుర్భాషలాడినందుకు ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ బెల్లంపల్లి కోర్టు న్యాయమూర్తి జే.ముఖేష్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. 2017లో భీమిని మండలంలోని వీగాం గ్రామానికి చెందిన గాండ్ల అంకమ్మ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వివస్త్రను చేసి, బూతులు తిట్టడంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శేఖర్ కేసు నమోదు చెశారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి


చికిత్స పొందుతున్న చిన్నయ్య

లక్ష్మణచాంద: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఒకరిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని రాచాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గైనం చిన్నయ్య కొన్నేళ్ల క్రితం లక్ష్మణచాందకు ఇల్లరికం వెళ్లాడు. మూన్నెళ్ల క్రితం తన తల్లి అనారోగ్యానికి గురికావడంతో రాచాపూర్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద భజనకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన భూషి రాకేష్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని చిన్నయ్యను దుర్భాషలాడడమే కాకుండా అతనిపై కర్రతో దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు ముత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు రిమాండ్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ఏకనాథ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ సింగ్ తెలిపారు. గుండంపల్లికి చెందిన తోట ప్రవీణ్ ఆదివారం రాత్రి ఆలయ ముఖద్వారానికి ఉన్న తాళం పగులగొట్టి హుండీలో ఉన్న నగదును అపహరించాడు. సోమవారం తెల్లవారు జామున వచ్చిన భక్తులు గమనించి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్యాయత్నం

సారంగపూర్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన క్లాం సాయన్న-లక్ష్మి దంపతులకు నలుగురు కుమారులు సంతానం. కొంతకాలం క్రితం సాయన్న మృతి చెందగా కుటుంబ బాధ్యతలు తల్లి లక్ష్మి చూసుకుంటోంది. ఈక్రమంలో మూడవ కుమారుడు అయిన శంకర్ కొద్దిరోజులుగా తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిని వేధిస్తున్నాడు. వద్దని వారించడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం గ్రామ సమీపంలోని ఓచెట్టుకు ఉరేసుకునేందుకు ప్రయత్నించాడు. అటుగా వెళ్లిన వ్యక్తి గమనించి తాడును కోసేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయం లేదని స్థానికులు తెలిపారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి


చోరీకి యత్నించిన వ్యక్తి

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ శివారులో ఉన్న మల్లన్న ఆలయంలో సోమవారం చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని అటుగా వెళ్తున్న పలువురు గమనించి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు అడిగితే నోరు విప్పడం లేదని, పేరు చెప్పడం లేదని, నిజాంసాగర్‌కు చెందిన వ్యక్తిగా తెలిసిందని పలువురు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స అందించిన సిబ్బంది
- నిలకడగా బాలికల ఆరోగ్యం
- పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో శంకరమ్మ

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల ఫుడ్ పాయిజన్ సంఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రెబ్బెనలోని గురుకుల బాలికల పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో బాలికలు పగలంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. రాత్రి భోజనం ముగించుకుని పడుకోగా.. పదో తరగతి చదువుతున్న స్పందన, సంకీర్తన, సంజన ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సిబ్బంది మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి స్పందన, సంజనను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంకీర్తన ఆరోగ్యం కుదుటపడడంతో బెల్లంపల్లి నుంచి ఇంటికి పంపించారు. మళ్లీ సోమవారం ఉదయం మరో విద్యార్థిని అక్షర సైతం అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను రెబ్బెన పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం బెల్లంపల్లికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శంకరమ్మ సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలతో పాటు పరిసరాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.


విచారణ చేపడుతున్న ఎంపీడీవో శంకరమ్మ


చికిత్స పొందుతున్న స్పందన


సంజనకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్య సమస్యలతోనే అస్వస్థత

బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. ఆదివారం విద్యార్థులంతా ఆనందంగా ఉన్నారని, రాత్రి భోజనాలు చేసి పడుకున్న తర్వాత ముగ్గురు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. సోమవారం ఉదయం మరో విద్యార్థిని అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తరలించామన్నారు. బాలికలు గైనక్ సమస్యతో పాటు ఆస్తమా, ఆయాసం వంటి కారణాలతో అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఇదే విషయంపై రెబ్బెన పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్‌ను వివరణ కోరగా.. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిందని ఇప్పుడే చెప్పలేమని అన్నారు. స్కానింగ్, ట్యూల్ కల్చర్ పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. కడుపునొప్పి, ఆయాసంతో పీహెచ్‌సీకి రాగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'గురుకులం' విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 2న శనివారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జావెలిన్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ముల్కల్ల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఏ.ఉల్లాస్ జావెలిన్‌త్రోలో బంగారు పతకం, బి.కార్తీక్ పరుగు పందెంలో రజత పతకం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో కాంస్య పతకం, రిత్విక్ 60 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో రజత పతకం సాధించారు. ఈ నెల 7న జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొననున్నారు. సోమవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారయ్య, ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పీడీ శ్రీకాంత్, పీఈటీ సాగర్, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు

పట్టపగలే రూ.5 లక్షలు చోరీ


బాధితుడు ఆనంద్‌గౌడ్

భైంసాటౌన్: పట్టపగలే ఓ దుండగుడు స్కూటీ డిక్కీ తెరిచి రూ.5 లక్షలు అపహరించిన ఘటన భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. ముధోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన బి.ఆనంద్‌గౌడ్ కూతురు అమెరికాలో ఉంటోంది. ఈ క్రమంలో తండ్రిని అమెరికాకు రప్పించుకునేందుకుగానూ ఆమె తన తండ్రి ఖాతాకు డబ్బు పంపింది. వాటిని డ్రా చేసేందుకు సోమవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. బ్యాంక్ నుంచి రూ.5లక్షలు విత్‌డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టాడు. కుభీర్ చౌరస్తాలోని సాయిలక్ష్మి బార్‌లో భోజనం చేసేందుకు స్కూటీని బయట నిలిపి లోనికి వెళ్లాడు. ఇదంతా గమనిస్తూ అతన్ని అనుసరించిన దుండగుడు స్కూటీ డిక్కీ తెరిచి నగదును అపహరించుకుపోయాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడు బయటకు వచ్చి చూసేసరికి డిక్కీ తెరిచి ఉండడం, నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆగంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.


సీసీ కెమెరాలో నమోదైన చోరీ దృశ్యం

కోర్టు ఆదేశాలు బేఖాతరు..

- వారం రోజులు కావస్తున్నా ప్రారంభంకాని ప్రక్రియ
- ఓరియంట్ ఎన్నికల ఊసేఎత్తని కార్మికశాఖ

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు బేఖాతరయ్యాయి. 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించి 20 రోజుల్లో పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాలని జూలై 28న హైకోర్టు కార్మికశాఖను ఆదేశించింది. వారం రోజులు కావస్తున్నా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించక పోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం నిర్వహించాల్సిన ఎన్నికలు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో వాయిదా వేస్తూ వస్తున్నారు. దీనిపై కార్మికసంఘం నాయకులు హైకోర్టును ఆశ్రయించగా ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. అయినప్పటికీ డీసీఎల్ దీర్ఘకాలిక సెలవులో ఉందన్న సాకుతో కార్మికశాఖ సాగతీస్తుండగా ఆ శాఖ కమిషనర్ స్పందించక పోవడం, డీసీఎల్ స్థానంలో తాత్కాలికంగా ఇతరులను నియమించక పోవడంపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్మికశాఖ రాజకీయ ఒత్తిళ్లు వీడి ఎన్నికల నిర్వహణకు ముందుకు వస్తుందా? లేక కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

కార్మికులకు జరిగిన అన్యాయాలు సవరించాలి

జైపూర్: జూలై 30, 31వ తేదీల్లో జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డులో కార్మికులకు జరిగిన అన్యాయాలను వెంటనే సవరించాలని సంస్థ యాజమాన్యాన్ని కోరామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సోమవారం జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 52 మంది కార్మికుల్లో కేవలం నలుగురిని మాత్రమే మెడికల్ ఇన్‌వాల్యుడేట్ చేయడం, చాలా మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అని చెప్పడం, కొంతమందిని అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ చేసి సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఇచ్చారన్నారు. ఇందులో ఆశ్చర్యకరంగా సర్ఫేస్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లను మెడికల్ అన్‌ఫిట్ చేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్‌గా ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ సొంతపిల్లల్లా భావించి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ అలుగు వర్షిని సంబంధిత హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుడ్ కమిటీ సభ్యులుగా పిల్లలను నియమించాలని, నెలకోసారి కమిటీలో మార్పులు చేయాలని సూచించారు. రాత్రిపూట మిగిలిన ఆహారాన్ని ఎప్పటికప్పుడు బయట పడేయాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్లు సెలవుపెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, డీటీడీవోలు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలను ఈ నెల 14 నాటికి పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు.

ప్రహరీ కూలి వలస కూలీ మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు ప్రహరీ గోడ కూలి వలస కూలీ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలంలోని పోతపల్లి గ్రామానికి చెందిన డోకే లచ్చయ్య (32) సోమవారం మరో ఆరుగురితో కలిసి ప్రహరీగోడ మరమ్మతు పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి లచ్చయ్య మీద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్థానిక ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు రాలేదన్నారు.

న్యాక్ ఏడీ నాగేంద్రం బదిలీ


ఏడీలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ఏడీగా పనిచేస్తున్న నాగేంద్రం హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బెల్లంపల్లికి చెందిన స్వప్నరాణిని ఏడీగా నియమించారు. సోమవారం బదిలీపై వెళ్తున్న ఏడీని, బాధ్యతలు చేపట్టిన నూతన ఏడీలను కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ సిబ్బంది రమేష్, దీపక్, మహేష్, తిరుపతి, మేరి విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై సీఐడీకి ఫిర్యాదు

నిర్మల్‌టౌన్: బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధి కోసం విడుదలయ్యే నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌లోని వివిధ జిల్లాల కార్యదర్శులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో సీఐడీకి ఫిర్యాదు చేశారు. పదేళ్లుగా హెచ్‌సీఏ జిల్లాల పేరుతో ఖాతాల్లో నమోదు చేసిన సుమారు రూ.12 కోట్లు దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇందుకు హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు, జిల్లా కార్యదర్శులు చేకూరి వెంకట్ (ఖమ్మం), చాగంటి శ్రీనివాస్(వరంగల్), కోదాటి ప్రదీప్ (ఆదిలాబాద్), ఎం.రాజశేఖర్(మహబూబ్ నగర్), ఏ.రాజేందర్‌రెడ్డి (మెదక్), వెంకట్‌రెడ్డి(నిజామాబాద్), ఆగం రావు (కరీంనగర్), సయ్యద్ అమీనుద్దీన్ (నల్గొండ) ఉన్నారని వివరించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిధులు రికవరీ చేయాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన ఎస్.చరణ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన ఎస్.చరణ్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రమేష్ తెలిపారు. హన్మకొండలో ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ట్రయాథ్లాన్-ఏ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించాడు. సెప్టెంబర్ 9 నుంచి 11వరకు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాడని వెల్లడించారు. అదే విధంగా హన్మకొండ వేదికగా జరిగిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సోమవారం క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థి శివాని 600 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీల భర్తీ

మందమర్రిరూరల్: సీసీసీ (నస్పూర్)లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ సింగరేణి కోటాలో వివిధ కోర్సుల్లో ఇంకా మిగిలి ఉన్న 66 సీట్లను భర్తీ చేయనున్నట్లు యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సివిల్ కోర్సులో 27, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 06, మెకానికల్‌లో 23, మైనింగ్‌లో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసిన తర్వాత ప్రభుత్వ కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 7న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9010222161 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు త్వరలోనే అనుమతి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


మంత్రులు సీతక్క, సురేఖతో ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు త్వరలోనే అనుమతులు వస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పలు విషయాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం విలేకరులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకకు సహకరించాలని, అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీలు, ఇతర రైతులను ఇబ్బంది పెట్టవద్దని, పోడు భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు సహకరించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, బఫర్‌జోన్‌ను రద్దు చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. తాత్కాలికంగా రోడ్లు, వంతెనలకు సహకరించాలని, ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒంటిద్దు పోకడలకు పోతే ఓపిక నశించి ప్రజలు తిరుగుబాటు చేస్తారని, ఈ విషయంపై ఆలోచించాలని, పై విషయాలపై వైల్డ్‌లైఫ్ బోర్డ్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేస్తారని ఆశభావం వ్యక్తం చేశారు.

ఆర్జీయూకేటీలో యక్షగాన కళా ప్రదర్శన

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో సోమవారం స్పిక్ మాకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో యక్షగాన కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువతలో సాంస్కృతిక అవగాహన పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. 'స్పిక్ మాకే' సంస్థ తెలంగాణ 4వ రాష్ట్ర కన్వెన్షన్‌ను ఈ ఏడాది బాసర క్యాంపస్‌లో నిర్వహించడం గర్వకారణమన్నారు. కర్ణాటక నుంచి వచ్చిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుడు శ్రీ కేరమనే శివానంద హెగ్డే మాట్లాడుతూ ఇంత గొప్ప వేదికపై ప్రదర్శించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా రామాయణంలోని 'సీతాపహరణం' ఘట్టాన్ని ఆధారంగా తీసుకుని, రావణుని అధర్మపు చర్యలు, సీతమ్మ త్యాగం, రామలక్ష్మణుల బాధలను అత్యంత హృద్యంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య మురళీదర్శన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ వేణుచందర్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

జైపూర్: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వడం లేదని భార్యను అతి కిరాతకంగా హత్యచేసిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుచందర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని నర్వ గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గోదారి రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. వచ్చిన పెన్షన్ డబ్బులు తాగుడుకు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న అతని భార్య రాజమణిని తరచూ డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఈ విషయంలో ఇద్దరికి తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 2న ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కర్రపై రాజమణి తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్


మాట్లాడుతున్న ఏఎస్పీ కాజల్ సింగ్

ఉట్నూర్‌రూరల్: ప్రజలు ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లో డ్రీమ్ డాలర్ లైఫ్ పేరుతో టోకెన్ ప్యాకెట్ అనే అప్లికేషన్ నందు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌ను జిల్లా పోలీసులు గుర్తించారన్నారు. ఇందులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని వణికి చెందిన రితేష్ వాతేకర్ ద్వారా ఉట్నూర్ మండలంలోని శాంపూర్‌కు చెందిన చౌకటే సంగ్రామ్, మెండె నారాయణ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లోని అప్లికేషన్ నందు రూ.1500 కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇరువురు దాదాపు 11 మందిని చేర్పించగా ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున వారికి వెళ్లినట్లు విచారణలో తెలిసిందన్నారు. ప్రజలు మల్టీ లెవెల్ మార్కెటింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రెండు ఎడ్లు, ఆవు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై బిట్ల పెర్సిస్

తానూరు(ముధోల్): ముధోల్ మండల కేంద్రంలోని ముక్త దేవి కాలనీలో ఆదివారం రాత్రి హంగిర్గ భోజన్నకు చెందిన రెండు ఎడ్లు, ఒక ఆవును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. భోజన్న తన రెండు ఎడ్లు, ఒక ఆవును సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న నీటి ట్యాంకు కింద కట్టేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వాటిని దొంగిలించారు. గమనించిన బాధితుడు భోజన్న సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై బిట్ల పెర్సిస్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించాడు. పశువుల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కరత్వాడ ప్రాజెక్టు కుడికాలువకు లీకేజీ

- వృథాగా పోతున్న నీళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

బోథ్: మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు కుడి కాలువకు లీకేజీ ఏర్పడి కొంతకాలంగా నీరు వృథాగా పోతోంది. వర్షాకాలంలో ప్రాజెక్టులో నీటిని ఆపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాలు లేక ప్రాజెక్టు లోకి నీరు రావడం లేదని, నీరు వృథాగా పోతుండడంతో ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని, రబీ సీజన్‌లో నీటికొరత ఏర్పడే అవకాశం ఉందని వాపోతున్నారు. విషయాన్ని బోథ్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాజు అనే యువ రైతు, పలువురు రైతులతో కలిసి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు చేశారు. దీంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు కుడి కాలువ ద్వారా వెళ్తున్న నీటిని ఆపివేశారు.


వృథాగా పోతున్న నీళ్లు

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల బెడద


బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల చేతివాటంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన కొడారి మంజుల, ఎడ్ల వనిత సోమవారం స్వగ్రామాలకు వెళ్లేందుకు ఖానాపూర్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇదే అదనుగా భావించిన దొంగలు మంజుల పర్సులో ఉన్న రూ.11,300, వనిత పర్సులో ఉన్న రూ.500 నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు. పర్సులో నగదుతో పాటు ఏటీఎం కార్డు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోలను చోరీ చేశారని బాధితులు పేర్కొన్నారు.